రేపు కుమ్మరుల వనభోజనాలు

లింగోజిగూడ: శాలివాహన (కుమ్మరుల) సంక్షేమ సంఘం హైదరాబాద్ తూర్పు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే శాలివాహన కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలని సంఘం హైదరాబాద్ తూర్పు విభాగం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి కోరారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను గురువారం ఎల్‌బీనగర్ ఆర్‌టీసీ కాలనీలోని శాలివాహన సంక్షేమ సంఘ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, మన్సూరాబాద్ సహారా రోడ్డులోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వనభోజనాల్లో పరిచయ కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యకమాలు నిర్వహిస్తామన్నారు. శాలివాహన కులస్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, అంజయ్య, ఇటుకల వీరయ్య పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 35, కాకర 35, బీర 40, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 25, దొండ 35–45, చిక్కుడు 45, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలు 23, దోస 25, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 38, చామగడ్డ 40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అభివృద్ధికి నోచని ఆడిటోరియం



కళావిహీనంగా మారిన ఆడిటోరియం వేదిక

- ఖాళీ స్థలాన్ని అద్దెకిస్తూ కాలం గడుపుతున్న అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

వనస్థలిపురం: స్థానికుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం వనస్థలిపురంలో నిర్మించిన హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నేడు శిథిలావస్థకు చేరుకుంది. ఆడిటోరియం వేదిక కళావిహీనంగా మారి, ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలు, చెత్తా చెదారానికి నిలయంగా మారింది. అటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆడిటోరియం అధ్వానంగా మారింది. హెచ్‌ఎండీఏ అధికారులు ఆడిటోరియం అభివృద్ధిని వదిలేసి ఆడిటోరియంలోని ఖాళీ స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

వనస్థలిపురంలో స్థానికుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం అప్పటి హుడా ఆధ్వర్యంలో 1998లో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించారు. మొదట్లో స్థానికుల అవసరాలకు ఉపయోగపడిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం అనంతరం నిర్వహణ లోపంతో మౌలిక వసతులు కరువై స్థానికుల ఫంక్షన్లకు ఉపయోగపడకుండా పోయింది. ఆడిటోరియంను అభివృద్ధి చేయాల్సిన అధికారులు ఆ విషయాన్ని వదిలేసి ఎలాగూ అద్దెలు వస్తున్నాయన్న కారణంతో సదరు స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ లబ్ధి పొందుతున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుందామన్న స్థానికులకు ఓపెన్ ఆడిటోరియం అందుబాటులో లేకుండాపోయింది.

అన్యాక్రాంతం అవుతున్న ఆడిటోరియం స్థలం

వనస్థలిపురంలోని హుడా ఆడిటోరియం రోజురోజుకూ అన్యాక్రాంతమవుతోంది. ఇప్పటికే ఆడిటోరియం స్థలంలో ఓ వైపు రోడ్డులో కొంతమేర సురభి కళాకారులు గత 13 ఏళ్లుగా కళావేదికను ఏర్పాటు చేసుకుని అక్కడే స్థిర నివాసం ఉంటున్నారు. గతంలో నాటక ప్రదర్శనలు నిర్వహించిన వారు ఇప్పుడు ఎలాంటి ప్రదర్శనలు లేకున్నా.. అక్కడే తిష్ట వేసి ఉన్నారు. అలాగే ఆడిటోరియం మరోవైపు రోడ్డులో మిగిలిన ఖాళీ స్థలాన్ని అధికారులు తరచూ వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో తమ ప్రాంతం నడిబొడ్డులో ఆడిటోరియం ఉన్నా... తమకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయిందని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకోని కాలనీ సంక్షేమ సంఘం...

వనస్థలిపురం నడిబొడ్డును ఉన్న ఆడిటోరియం అధ్వాన స్థితికి చేరుకుంటున్నా.. దానిని అభివృద్ధి చేయడంలో వనస్థలిపురం కాలనీ సంక్షేమ సంఘం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి రెండు, మూడు కమిటీలు మారినా ఎవరూ ఆడిటోరియం అభివృద్ధిని పట్టించుకోలేదని అంటున్నారు. ఇలా ఉండగా, గత కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం పదవీ కాలం ముగియడం, రాజకీయ కారణంగా కార్యవర్గ ఎన్నికలో జాప్యం జరుగుతుండటంతో ఇక ఆడిటోరియం అభివృద్ధిని ఎవరు పట్టించుకుంటారని వారు అంటున్నారు. స్థానిక కార్పొరేటర్ కూడా ఈ విషయంలో చొరవ చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకుని ఆడిటోరియంను మినీ రవీంద్రభారతిలా అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఆడిటోరియం అనుబంధ గదులు



ఆడిటోరియం ఆవరణలో సురభి కళాకారులు నిర్మించుకున్న వేదిక



ఆడిటోరియం ఖాళీ స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకు ఇచ్చిన దృశ్యం

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ సాయిబాబ ఆలయం నుంచి దుర్గాసాయినగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ రాకేష్, సిబ్బంది శ్రీకాంత్, నాయకులు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీని పట్టించుకోని అధికారులు



పైప్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని బాతుల చెరువు అలుగు జీ స్కూల్ మలుపు సమీపంలో తాగునీటి పైప్ లీకై నీరంతా వృథాగా పోతోంది. కొన్ని నెలలుగా ఇక్కడ నీరు లీకవుతుండటంతో రోడ్డంతా కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మలుపు వద్ద ఏర్పడ్డ ఈ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, లీకేజీని అరికట్టి ప్రమాదాలను నివారించాలని జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఈ సమస్యను పరిష్కరించడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

దివ్యాంగ జంటలకు ఉచితంగా వివాహం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మొగుళ్లపల్లి యువసేన సభ్యులు

చైతన్యపురి: రెండు దివ్యాంగ జంటలకు మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో ఉచితంగా వివాహం జరిపించారు. హనుమంతరావు– అంజనమ్మ, లావణ్య– నర్సింహ జంటలకు దాతల సహకారంతో అవసరమైన బంగారు పుస్తెలు, మెట్టెల, పట్టువస్త్రాలను అందజేసి వేదబ్రాహ్మణులచే హిందూ సాంప్రదాయం ప్రకారం పెళ్లి జరిపించామని సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా తెలిపారు. అనంతరం వధూవరుల బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఈడీ దివ్యాంగుల సంస్థ చైర్మన్ ఎం.గంగారాం, గజం నర్సింగరావు, నాగభూషణరావు, మిరియం బాబూరావు, చిదర రమేష్, మాలే శ్రీనివాస్, అభిలాష్‌రెడ్డి, సత్యనారాయణ, పవన్, సత్యనారాయణ తదితరుల పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



శానిటేషన్ సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: పారిశుద్ధ్య విధుల నిర్వహించే కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం పేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, రెయిన్‌కోట్, సబ్బులు, ఆయిల్‌తో కూడిన కిట్లను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులన్నీ స్వీకరించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీహెచ్‌ఎంజీ జవాన్ యాదగిరి, ఎస్ఎఫ్ఐ పాండు తదితరులు పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ!

- ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు
- సొత్తు స్వాధీనం



నిందితుడు సంద్ర మహేశ్

హస్తినాపురం: పగటి పూట కాలనీల్లో రెక్కీ నిర్వహించి తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించడం.. రాత్రి వేళల్లో ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడటం... ఇలా దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. . నల్లగొండ జిల్లా రావిపహాడ్ మండలం అప్పన్నగూడెం గ్రామానికి చెందిన సంద్ర మహేశ్ (27) కేర్‌టేకర్‌గా పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉంటున్నాడు. తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలన్న అత్యాశతో చోరీలు మొదలు పెట్టాడు. పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించి.. రాత్రి సమయంలో తాళం పగులగొట్టి ఆ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు ల్యాప్‌టాప్ , సెల్‌ఫోన్లను అపరించుకెళ్తున్నాడు. వనస్థలిపురం ఠాణా పరిధిలో రెండు దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న మహేశ్‌ను గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు ల్యాప్‌టాప్, జేబీఎల్ స్పీకర్, ఆపిల్ ఐ పాడ్, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

బియ్యం గింజలతో రేవంత్‌రెడ్డి చిత్రపటం



నాగోలు: తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన చిత్రపటాన్ని బియ్యం గింజలతో రూపొందించి శుభాకాంక్షలు తెలిపాడు ఎల్‌బీనగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు నాగార్జున రాము. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, పేద చిత్రకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నానన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, యాదవ మహాసభ నేతలు



సన్మానం సందర్భంగా ఎయిర్ గన్స్‌తో విజయ సంకేతాన్ని చూపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేగా మరోసారి విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని నియోజకవర్గంలోని పలువురు నేతలు గురువారం ఆత్మీయ సత్కారం చేశారు. మాజీ కౌన్సిలర్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్ నేతృత్వంలో యాదవ మహాసభ నేతలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

- కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి, కట్ట వెంకటేష్ తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఘనంగా జీఎస్ఐటీఐ వ్యవస్థాపక దినోత్సవం



జీఎస్ఐటీఐలో మొక్కలు నాటిన ఏడీజీ వెంకటేశ్వర్‌రావు, రిటైర్ డీజీ కుటుంబరావు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ) 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బండ్లగూడలోని జీఎస్ఐటీఐలో డీడీజీ డాక్టర్ మాథ్యూజోసెఫ్ నేతృత్వంలో గురువారం నిర్వహించారు. జీఎస్ఐ ఏడీజీ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డా.ఎస్. కుటుంబరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాద్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ జీఎస్ఐటీఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, డ్రోన్ టెక్నాలజీ, లిడార్ వంటి ఆధునిక రంగాల్లో శిక్షణను అందిస్తున్నదన్నారు. అనంతరం సంస్థ కార్యాలయ ఆవరణలో ఏడీజీ వెంకటేశ్వర్‌రావు, రిటైర్డ్ డీఈ కుటుంబరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ డాక్టర్ గంజి మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణపై నిర్లక్ష్యం



అవంతి కాలేజీ లైన్‌లో పగటి పూట వెలుగుతున్న వీధి దీపం

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాత్రి పూట వెలగాల్సిన వీధి దీపాలు పగటిపూట కూడా వెలుగుతుండటంతో ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ సబ్ రోడ్ నుంచి అవంతి కాలేజీ లైన్‌లో మూడు నెలలుగా వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని ఇందిరానగర్ కాలనీ సంక్షేమం సంఘం ప్రతినిధి తుమ్మల బాల్‌రెడ్డి ఆరోపించారు. వెలగని వీధి దీపాలను బాగు చేయడం లేదని, వెలుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

23న ప్రాచీన మందిరాల జీర్ణోద్ధరణ

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీర్ణావస్థలో ఉన్న ప్రాచీన మందిరాల పునర్నిర్మాణ కార్యక్రమానికి ఈ నెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశి రోజున శ్రీకారం చుడుతున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఆయన మాట్లాడుతూ... నవగ్రహాలు, నాగదేవత, మరకత లింగం, స్పటిక లింగం విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజున పవిత్రమైన గంగా, యమునా, సరస్వతి మహానదుల జలంతో అభిషేకం, వేద పండితులచే విగ్రహాల ప్రతిష్టాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగస్వాములు కావాలనుకునే భక్తులు వివరాలకు సెల్: 99492 38492లో సంప్రదించాలని కోరారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

కాచిగూడ: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం లోకేష్ వైష్ణోయ్ అన్నారు. కుటుంబ సభ్యులతో ఒక్క రోజు గడిపితే తాము పడుతున్న బాధలన్నీ కనుమరుగై ఆనంద జీవితాన్ని గడపవచ్చని ఆయన అన్నారు. గురువారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైల్వేలో లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లదే ప్రధాన పాత్ర అని, వీరు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.కోటేశ్వర్ రావు, కిరణ్‌కుమార్, జీవన్, ప్రసాద్ కుమార్, శశాంక్ యాదగిరి, స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం..



సమావేశానికి హాజరైన పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

మలక్‌పేట: కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి తెలిపారు. సలీంనగర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందుతాయని, బకాయి పడిన మూడు డీఆర్‌లు వెంటనే మంజూరు చేస్తూ, సదరు మొత్తాన్ని ఒకేసారి విడుదల చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. హెల్త్ కార్డు లేని ప్రభుత్వ ఉద్యోగులకు ఈసారి ఆ సదుపాయం కల్పించాలని కోరారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ వినయ్‌కుమార్, కోశాధికారి ప్రసాద్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిమ్స్ కొత్త ఛైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన ఛైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ ఛైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంలో ఆస్పత్రి విస్తరణ, అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే సబితారెడ్డి

- ప్రజా తీర్పును స్వీకరిస్తా
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడతాం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో ఇక్కడ చేసిన అభివృద్ధిని చూసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనను గెలిపించిన ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఇక నుంచి ప్రతీ గ్రామంలో పర్యటించి ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. అంతకు ముందు శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీపీ కె. సునీతా నాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ ఛైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఎస్. శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ ఛైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆనందం, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హస్నగళ్ల చంద్రయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామంలో కొలువైన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతి, గోదా సమేత అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. స్వామివార్లకు పుష్పార్చన, మూలదేవత హోమాలు, ప్రసాద వితరణ, సాయంత్రం లక్ష్మీ హోమం, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామాలు, పారాయణం, లక్ష్మీదేవికి కుంకుమార్చన, ప్రసాద వితరణ పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దంపతులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, ఎంపీటీసీ పెంటల కుమారిరాయప్ప, శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఆవుల రమేశ్, ఉపాధ్యాక్షులు నీరటి జగదీష్ ముదిరాజ్, కమ్మరి బుచ్చిబాబు చారి, పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.